వి. రాజారామమోహనరావు

# కోటి మందు

"అరే... యింకోటిరోయి ..." అన్నాడు నర్సిగాడు.

మిగిలిన అయిదుగురు వాడి వెనకాల చేరారు. చేయెత్తి వాడు చూపించినవేపు చూశారు. ముందు చెట్టుపోల్చుకోవటం... ఆతర్వాత కొమ్మ... ఆతర్వాత ఏ ఆకుచాటు నుండోచూట్టం... యిదీ వాళ్ళు చేసే పని...

అందరూ పది పన్నెండేళ్ళ వయస్సు వాళ్ళే. ఎవడివొంటి మీదా తిన్నగా గుడ్డలేవు. వాళ్ళందర్లో లాగూ చొక్కా రెండూ వున్నవి యిద్దరికే...అవేనా అడ్డమైన చిరుగుల్తో పీలికల్లా వేళ్ళాడుతున్నాయి. ఆరుగురికి ఆరు పేర్లు మాత్రం వున్నాయి...అవే వాళ్ళ ఆస్థి.

సింహం నోటిలావున్న గేటు దగ్గర గుంపుగా చేరారు. అప్పటికే అయిదారుసార్లు కేకలేసిన గూర్ఖా యింక విసుగొచ్చి వూరుకున్నాడు.

గేటుకి...లోపలి మేడకి మధ్యనున్న దూరాన్ని కాపలాకాస్తూ చాలా చెటున్నాయి. ఆరాత్రి అవన్నీఅందంగా వెలుగుతున్నాయి. ఆ యింట్లో ఆరోజు పండగ. అందుకని చెట్ల నిండా చిన్నచిన్న బల్బులు పెటారు. గేటు దగ్గర్నించి మేడ పెదవెలుగు ముద్దలా వుంది.

నర్సిగాడి బృందం గేటు దగ్గర చేరి వెలుగుతున్న చెట్లని చూశారు ముందు. కాస్సేపటికి చెట్లకొమ్మల్లో అక్కడక్కడ నక్షత్రాల్లా మెరుస్తున్న ఎర్రటి బల్బుల్ని చూశారు...చూశాక వొకడి తర్వాత వొకడు ఒక్కో ఎర్రటి నక్షత్రాన్ని వెతికి పట్టుకోటం మొదలెట్టారు.

ఇందాక నర్సిగాడు...యింకోటిరోయి... అని చూపించింది అలాంటి నక్షత్రాన్నే.

ఆ వీధికి అదే చివరి మేడ... అదే ఖరీదైన మేడ. వీధి మూల ఆ మేడ కాంపౌండ్ నానుకుని వోచెత్త కుండీ వుంది. గూర్ఖావాడు గట్టిగా కేకలేసినప్పుడు కాస్సేపు ఆ కుండీ దగ్గర కూచుని తిరిగి గేటు దగ్గరికి చేరటం అలవాటు చేసుకున్నారు నర్సిగాడి బృందం.

అలాగే గేటు దగ్గరకు వచ్చిపోయే రాకపోకల్లో రోడ్డు మీద కాస్సేపు గంతు లేసేవారు. అల్లిబిల్లిగా పాటలు పాడేవారు ... బూతులు తిట్టుకునే వాళ్ళు.

ఆ మేడలోని ఆ రాత్రి ఆనందం కోసం చాలామంది పెద్ద మనుషులు అలా గంతు లేస్తున్న వాళ్ళని చూశారు.

ఆ రోజు డీల్‌లో పాతికవేల బదులు పదివేలే లాభం వచ్చిందని మధన పడుతున్న వో గొప్పాయన, కోరుకున్న ఆడదానితో కాక మరో ఆడ కూతురుతో ఆ రాత్రి గడపాల్సి వొచ్చినందుకు గ్యామీగా వున్న మరో పెద్ద మనిషి...యిలా చాలా మంది వాళ్ళని చూశారు. చూసి...వెధవలకి లైఫ్‌లో ప్రాబ్లమ్స్ ఏవీలేవు...అందుకే ఆనందంగా అలా గంతులేస్తున్నారు...' అనుకున్నారు.

పది పన్నెండేళ్ళ వయస్సులో ఆకలికి తట్టుకోవటం చాలా కష్టం. అలాంటిది ఆకల్ని చాలా కేర్‌లెస్‌గా చూట్టం నర్సిగాడి బేచ్‌కి నిత్యం అలవాటైపోయింది. మరీ ఎప్పుడైనా ఆకలి గట్టిగా ఎదురు తిరిగితే దానితో దెబ్బలాట్టానికి వాళ్ళ దగ్గర బోల్కన్ని ఆయుధాలున్నాయి. నీళ్ళు తాగడం...గంతులేయటం లైట్లాట ఆడుకోటం...గట్టిగా బూతులు

తిట్టుకోటం...ఇప్పుడు వాటిలోనే లైట్లాట ఆడుకుంటున్నారు....ఎర్ర బల్బు కనిపిస్తుందేమోనని మరీ వెతికి వెతికి చూస్తున్నారు.

రంగడు మాత్రం లైట్లవైపు చూట్టం మానేశాడు. అందర్ని వొదలి వెళ్ళటం వాడికిష్టం లేదు... అలా అని అక్కడ అలా నిలబడే ఓపికాలేదు. వీధి చివరివేపుచూశాడు. చెత్తకుండీ కదలకుండా నల్లరాక్షసిలా నిలబడుంది. వెన్నెల రోజులు కాబట్టి అక్కణ్ణించి బాగానే కనిపిస్తోంది. దానివైపు అలా చూస్తుంటే రంగడికి వో భయంకరమైన ఆలోచనవచ్చింది. అంతే, వెంటనే నర్సిగాడి భుజం పుచ్చుకుని లాగాడు.

"అరే నర్సిగా మేడ అంత దూరంలో వుందిగా...మిగిలినవి ఇక్కడిదాకా తేరేమో" అన్నాడు;

మేడ లోపలి హడావిడి అంతా అయిపోవాలి. వాళ్ళందరూ తినేశాక తీసేసిన మిగిలిన పదార్థాలు బైటికొచ్చి, గోడదాటి రోడ్డుమీద కుండీలో పడాలి. వాటికోసం నర్సిగాడి బృందం నిరీక్షణ. రంగడన్నది వినేటప్పటికి నర్సిగాడికి అనుమానం వొచ్చింది, వో క్షణం.

అప్పటికే రాత్రి పది దాటుతోంది. ఈ యిల్లు తప్ప ఆ రాత్రికి ఆశేంలేదు. అందుకనే అదో పెద్ద సమస్యలా తోచలేదు నర్సిగాడికి.

"అందరూ ఎల్లేదాకా చూద్దాం...కుండీదాకా తెచ్చిపారేస్తే తిందాం...లేకపోతే లేదు. మనం యిప్పుడే పోయి చేసేదేముంది..." అన్నాడు అదీ నిజమే అనిపించింది రంగడికి.

గూర్ఖాకి కాళ్ళు లాగినట్టున్నాయి...నెమ్మదిగా స్టూల్‌మీద కూలబడ్డాడు. ఎందుకేనా మంచిదని మరోసారి గట్టిగా కేకలేశాడు.

గుంపంతా వెనక్కొచ్చింది, వొచ్చి రోడ్డువారగా చతికిల బడ్డారు. గంతులేసే వోపిక ఎవర్లోనూ మిగల్లేదు. నెమ్మదిగా సోదిమొదలెట్టారు....వాగేవాళ్ళు వాగుతూనే కుండీవేపు చూస్తున్నారు. నర్సిగాడి కాలుమీద తలెట్టుకుని పడుకున్నాడు రంగడు. గూర్ఖానెత్తిమీంచి రంగురంగుల చెట్లు, వాటివెనక మేడ కనిపిస్తున్నాయి.

"అసలు ఏంజరుగుతోందిరా యీ ఇంట్లో, పెళ్ళా?" అన్నాడు రంగడు.

"ఏమోరా"...అన్నాడు నర్సిగాడు. అ యింట్లో ఏదో హడావిడి జరుగుతోందని తప్ప అదేమిటో ఎవరికీ తెలియదు. పెళ్ళయినా, చావైనా వాళ్ళకొకటే...వాళ్ళకి కావల్సిందల్లా తిండి...

ఇంకా అడుక్కునే వ్యాపారంలో అంతగా ప్రావీణ్యం రాలేదు వీళ్ళకి. వీళ్ళ వయసు వాళ్ళు కొంతమంది వీళ్ళకన్నా బాగా కడుపు నింపుకుంటున్నారు. కాని వెనకాల వున్న హంగేమిటో వీళ్ళకి తెలుసు... బొత్తిగా అయిదేళ్ళలోపు పిల్లలు, లేదా కాలు చెయ్యి వొంకరున్న వాళ్ళు...వాళ్ళవెనక పెద్దముష్టివాళ్ళ అండ దండలు. అవేవీ వీళ్ళకిలేవు కాబట్టి కడుపునింపు కోటానికి యిదేదారి మిగిలింది.


వాళ్ళల్లోంచి ఎప్పుడు లేచెళ్ళాడో... వెంకిటిగాడు గూర్ఖాదగ్గరికెళ్ళాడు. వెళ్ళి నాలుగు తిట్లుతిని నెమ్మదిగా సమాచారం సంపాదించాడు.

"అరేనర్సిగా నాకు తెలిసింది..." అంటూ పరిగెత్తుకొచ్చాడు.

"ఏంటిరా" అన్నాడు నర్సిగాడు.

"ఈమేడావిడ పుట్టిన రోజంట అన్నాడు.

"పుట్టిన రోజేంటిరా..." అన్నాడు రాములుగాడు. వాడికేంచెప్పాలో అర్థం



కాలేదు నర్సిగాడికి. ఆ గ్రూపులో అందర్లోకీ వాడే పెద్ద. నెమ్మదిగా ఆలోచించి... ''ఆళ్ళ మ్మానాన్నకి ఆళ్ళ పుట్టినరోజురా'' అన్నాడు.

నర్సిగాడు చెప్పింది రాముల్తో పాటు రంగడూ విన్నాడు...విని "అయితే అందరూ పుట్టిన్నాడు యిలాగే పండుగలా చేసుకుంటారేంటిరా'' అన్నాడు.

నర్సిగాడు ఏం ఆలోచించకుండా "...ఆ ...ఆ...అందరూ చేసుకుంటారు'' అన్నాడు.

మరోక్షణం గడిచాక నర్సిగాడి కాలు మించిలేశాడు రంగడు. లేచి...''అయితే నీ పుట్టినరోజు ఎప్పుడ్రా...'' అన్నాడు

ఏంచెప్పాలో యీసారి తోచలేదు నర్సిగాడికి. చివరికి నెమ్మదిగా "ఏమో ఎప్పుడో నాకేం తెలుసురా...'' అన్నాడు

మిగిలిన అయిదారుగురు ఒకడి ముఖం మరొకడు చూసుకునే ప్రయత్నం చేశారు. మబ్బుకమ్మిన వెన్నెల్లో ఎవరిముఖం ఎవరికీ కనపళ్ళేదు. వాళ్ళల్లో ఎవడికీ వాళ్ళే రోజు పుటారో తెలియదు.

అందర్నీ చూశాడు నర్సిగాడు. ఆకలి కూడా చచ్చిపోయినంత నిశ్శబ్దంగా కూచున్నారు వాళ్ళు. మరి కాసేపటికి అందర్నీ వోదార్చాలన్నట్టు గట్టిగానవ్వుతూ అన్నాడు. "మనకి అమ్మా నాన్నే తెలియదు. పుట్టిన రోజెప్పుడో ఎలా తెలుస్తుందిరా...'' అని

నర్సిగాడు అలా అన్నా ఎవరూ మాట్లాడలేదు. ఏదో చిక్కటి చీకటిలో కూరుకుపోయిన వాళ్ళలా, మాటలు మరిచిపోయిన వాళ్ళలా కూచుండి పోయారు. చుట్టూవున్న మసక వెన్నెల్ని, పైనున్న మబ్బుల్ని చూస్తుంటే తమకి అందని లోకమేదో వున్నట్టు, చిన్నతనంనుంచీ తల్లీదండ్రుల చేరువలో...ఆ లోకపు ఆనందంలో పెరిగిన చాలా మంది అదృష్టవంతుల మధ్య ఏ కాకులుగా మిగిలిపోయినట్టు అలాగే కూచుండి పోయారు.

మరి కాసేపు చూసి...''ఏంటిరా అందరూ ఏంమాటాడకుండా ఆ కూసోటం'' అన్నాడు

నర్సిగాడు. దగ్గరవున్న రంగడి భుజం పట్టుకు కుదిపాడు.

రంగడికి అసలే నీరసంగావుంది. రెండు పూటలుగా వాడికి కడుపునిండే తిండిలేదు. సరికదా కనీసం ఏదో వొకటితిన్నాను. అనుకోటానికేనా సరిపడే తిండి దొరకలేదు. చెత్తకుండీల్లో ఎంగిలాకుల్లో రంగడికి దొరికింది తింటానికి ఏమాత్రం వీలులేనంత దారుణంగా వుండటం వల్ల క్రితం రాత్రినుంచీ ఖాళీకడుపుతోనే వున్నాడు.

దానికితోడు యిప్పుడు యీ అమ్మానాన్న అన్న ఆలోచనతో మరింత నీరసం కమ్ముకున్నట్లయింది. కేవలం పదేళ్ళ ఆ వొంటినే కాదు మనసుని కూడా కమ్ముకుంది ఆ నీరసం.

నర్సిగాడు మరోసారి రంగడి భుజం కుదిపాడు. కుదిపి...''ఏంటిరా ఆలోచన..'' అన్నాడు.

''ఏంలేదురా ...మనకీ అమ్మా నాన్న వుంటే ఎలావుండేదో...''అన్నాడు రంగడు.

రంగడికే కాదు యించుమించు వాళ్ళందరికీ వచ్చింది ఆ ఆలోచన. చాలాచోట్ల చాలా మంది తల్లిదండ్రులు పిల్లల్ని ముద్దు చేస్తుండగా, మురిసిపోతుండగాచూశారు వీళ్ళు. అలా అడిగిన రంగడు నర్సిగాడి వేపే చూస్తూ వుండిపోయాడు.

''ఏమోరా మిగిలినవన్నీ ఎలావున్నా యింత ఆకలిమాత్రం ఉండేది కాదేమోరా'' అన్నాడు నర్సిగాడు. వాడెందుకలా అన్నాడో వాడికే తెలియనట్టుంది వాడిముఖం.

అంచెలంచెలుగా మాటల్లోపడి మరో అరగంటకి అందరూ చెత్తకుండీవేపు, మేడ వేపూ చూసే ధోరణికొచ్చారు. కానీరంగడు మాత్రం వాళ్ళ మాటలమధ్యలో ఎప్పుడో వోరగా వొరిగి, మరికాస్సేపటికి నేలని కౌగలించుకుని పడుకుండిపోయాడు.

అంతకుముందు వెలుగుముద్దలా వున్న మేడ చాలాభాగం చీకటైపోయింది. ఎక్కడో వో మూల మాత్రం లైట్లున్నాయి. వచ్చిన వాళ్ళు చాలామంది వెళ్ళిపోయారు. ఆ మేడావిడికి బాగా దగ్గరివాళ్ళుమాత్రం నాలుగైదు జంటలు మిగిలిపోయారు. మేడలో అంత వరకూ గడిచిన ఆనందం తర్వాత ఆనందానికి పనివాళ్ళుంటే ఇబ్బందిగా ఉంటుందని అందర్నీ వెళ్ళిపొమ్మంది ఇంటావిడ.

ఆవిడ చెప్పిందానికి ఎదురుచెప్పే సాహసం లేక అందరూ తినగా వొదిలేసినవి ఆ హాలంతా చిందరవందరగా వున్నా శుభ్రం చేసే అవకాశం లేక పనివాళ్ళు వెళ్ళిపోయారు.

ఓ పక్క వెలుగ్గా మిగిలిపోయిన ఆమేడ మరింత చీకటిగా మారిపోయింది.

ఆ చీకటినిచూసి కొందరూ, చూడక ముందే కొందరు నర్సిగాడి బృందం ఒకళ్ళ మీద ఒకళ్ళు తలలెట్టుకుని నిద్రలోకి జారిపోయారు.

తెల్లారింతర్వాత అందరికన్నా ముందు నర్సిగాడికే మెళుకువొచ్చింది. నెమ్మదిగా లేచాడు. కాళ్ళదగ్గర పడుకున్న రంగడి మూలుగు నెమ్మదిగా వినపడింది.

''ఒరేయ్ రంగా...రంగా...'' అని కుదిపాడు.

మూలగటం తప్ప రంగడు లేవలేదు. మిగిలిన అందర్నీ లేపాడు నర్సిగాడు. అందరూ ప్రయత్నించారు రంగణ్ని లేపటానికి. మూలుగు తప్ప రంగడిలో మరో ధోరణి కనిపించలేదు.

ఓ అరగంటసేపు అందరూ అన్ని రకాలుగా కంగారుపడ్డాక రంగడు వోసారి కళ్ళు

తెరిచి మళ్ళీ మూసుకున్నాడు. ఓసారి కదలి కలో నాలికతో పెదాలు తడుపుకున్నాడు.

అది చూసి నర్సిగాడు రాములుగాణ్ని వెళ్ళి కాసిని నీళ్ళు పట్టుకురమ్మన్నాడు. వాళ్ళందరికీ కలిపి జాయింటుగా వున్న చిల్లు గ్లాసు తీసుకుని పరిగెత్తాడు రాములుగాడు.

సూర్యుడు బాగా పైకొచ్చాక... ఆ మేడ తాలూకు నౌఖర్లు వోచిన్న బుట్టతో బైటి కొచ్చారు, చేతిలో బుట్టని చెత్తకుండీదగ్గర ఖాళీచేసి వీళ్ళవేపు వోసారి చూసి లోపలికి వెళ్ళిపోయారు

పగిలిపోయిన గ్లాసులు, ప్లేట్లు వాటితో పాటు కలిసిపోయి కలగా పులగంగా వున్న రకరకాల పదార్థాలు... నర్సిగాడి బృంద మంతా చూసింది. క్రితం రాత్రంతా ఆతృతగా ఆకలిగా ఎదురుచూసిన నిధి... ఎవడూ కదల్లేదు

వాళ్ళలాంటి వాళ్ళదే మరో గ్రూపుగాని, లేదా వీళ్ళతో సమానంగా పోటీపడే కుక్కలుగానీ అక్కడుంటే అలా కూచునుండకపోయేవారేమో. కానీ అక్కడ మరెవరూ లేకపోవడంవల్ల వాటివేపు చూసినా రంగణ్ని వొదిలి ఎవరూ లేవలేదు.

రాములుగాడు గ్లాసులోంచి సగం కారిపోగా మిగిలిన సగం నీళ్ళుతెచ్చాడు.

వాటిని తీసుకుని నెమ్మదిగా రంగడి ముఖంమీద చల్లాడు నర్సిగాడు. కాస్సేపటికి రంగడు కొద్దిగా కదిలాడు.

అదిచూసి రాములు... ''వాడికి ఏదేనా మందేయాలేమోరా...'' అన్నాడు నర్సిగాడితోటి.

నర్సిగాడేం మాట్లాడలేదు. మందులు వైద్యాలు తమలాంటి వాళ్ళకి దొరకవని తెలుసు నర్సిగాడికి.

రంగడు మరికొంచెం కదిలాక వాణ్ని వొదిలి నెమ్మదిగా లేచాడు. లేచి మిగిలిన వాళ్ళందరూ వింతగా చూస్తుండగా చెత్తకుండీదగ్గరకెళ్ళాడు. వెళ్ళి గాజుపెంకుల్ని పక్కకు తీసి అక్కడున్నవాటిల్లోంచి కొంత తిండి రెండుచేతుల్లోకి తీసుకుని వెనక్కి వచ్చాడు.

రాములు నెమ్మదిగా రంగణ్ని కూచోపెట్టాక, తను తెచ్చినదాన్ని... ఆ కూటిమందుని...కొద్దికొద్దిగా వాడికి తినిపించాడు నర్సిగాడు.

వాడు తిన్న కాసేపటికి, వాడి కళ్ళల్లో మగత తగ్గిన కాస్సేపటికి... నెమ్మదిగా అందరూలేచి రంగణ్ని నడిపించుకుంటూ చెత్తకుండీవేపు కదిలారు. ✱

## రచయితలు గమనించాలి...

ప్రజాతంత్రలో ప్రచురణకు స్వీకరించబడని రచనలు, తగిన పోస్టేజి జతపరిచినా తక్షణమే త్రిప్పిపంపడం సాధ్యపడదు. రచనల పరిశీలనకు కనీసం రెండు నెలలు వ్యవధి అవుసరమవుతుంది. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు కూడా అవకాశం వుండదు. సమాధానాలకోసం కార్డులు, ఇన్‌ల్యాండ్ కవర్లు పంపనవసరం లేదు. రచయితలు గ్రహించవలసిందిగా కోరుతున్నాం.

—ఎడిటర్